


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

- మిషన్ భగీరథతో గ్రామానికి సరిపడా తాగునీటి సరఫరా..
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో తీరిన రోడ్ల సమస్య..
- రూ.2కోట్ల 70లక్షలతో రోడ్డు మంజూరు..

మిషన్ భగీరథ

# నాడు చెలిమ నీరే దిక్కు..
# నేడు నట్టింటికే నీళ్లు..

***మండలంలోని అంగడిరైచూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మాపూర్ గ్రామం అటు నియోజకవర్గ కేంద్రానికి, ఇటు కర్ణాటక బార్డర్‌లో ఉంది. గతంలో ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలైన తాగునీటి, రోడ్డు వసతులు అందుబాటులో ఉండేవి కావు. అప్పట్లో తాగునీటి సౌకర్యాలు లేక గ్రామం నుంచి దాదాపు 3 కిలోమీటర్ల దూరం కొండలు గుట్టల్లో పారుతున్న చెలిమ నీటిని తెచ్చుకొని గొంతు తడుపుకునే వారు. కానీ, నేడు మిషన్ భగీరథతో ఆ గోస తీరింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటికీ నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచింది. -కొడంగల్, నవంబర్ 28***



చెలిమ వద్ద నీటిని నింపు కొంటున్న మహిళలు (ఫైల్ ఫోటో)



ఇంటి వద్ద మిషన్ భగీరథ నీటిని నింపు కొంటున్న మహిళ

కొడంగల్, నవంబర్ 28 : మండలంలోని అంగడిరైచూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మాపూర్ గ్రామం అటు నియోజకవర్గ కేంద్రానికి, ఇటు కర్ణాటక బార్డర్‌లో ఉంది. గతంలో ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేవి కావని గ్రామస్తులు తెలిపారు. ఒక పక్క తాగడానికి నీరు లేక, మరోపక్క కనీసం రోడ్డు వసతులు లేక అనేక ఇక్కట్లు పడ్డామన్నారు. అప్పట్లో గ్రామం నుంచి దాదాపు 3 కిలోమీటర్ల దూరం కొండలు గుట్టల నుంచి చెలిమ నీటిని తెచ్చుకొనే వారు. రాత్రి, పగలు లేడా లేకుండా ప్రతి ఒక్కరూ నీటి కోసం మైళ్లదూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. సాధారణ రోజుల్లో ఇటువంటి పరిస్థితి ఉంటే వేసవిలో మరింత దారుణంగా ఉండేదని, దాంతో పాటు శుభకార్యాలు చేసుకోవాలంటే మరింత ఇబ్బందుల పడాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు.

### సీఎం కేసీఆర్‌తో తీరిన జఠిలమైన తాగునీటి సమస్య..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితో గ్రామానికి తాగునీటి సమస్య తీరిందని స్థానికులు తెలిపారు. ప్రజలకు అన్ని కాలాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా శ్రీశైలం మిగులు జలాలను గ్రామాలకు తరలించే విధంగా మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించి వందలాది కోట్ల రూపాయలతో దాదాపు 300 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాజలాలను శుద్ధిచేసి ఇంటింటికీ అందించే పథకంతో నీటి తిప్పలు తప్పినట్లు తెలిపారు. గ్రామంలో దాదాపు 72 నివాస గృహాలు ఉన్నాయని, 72 ఇండ్లకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు నల్లా కనెక్షన్‌లను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతిరోజూ గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా పుష్కలంగా నీటి సరఫరా జరుగుతున్నది. దీంతో ఇంటి వద్దనే స్వచ్ఛమైన కృష్ణా నీటిని తాగుతున్నట్లు తెలిపారు.

### రూ.2కోట్ల 70లక్షలతో బీటీ రోడ్డు మంజూరు..

ఏండ్ల కాలంగా రోడ్డు కోసం ప్రతి ఒక్క నాయకుడిని, అధికారులను ఆశ్రయించామని, అయినప్పటికీ తమ ఆవేదన ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి కూడా మా గ్రామాన్ని పట్టించుకోలేదు. గ్రామానికి రోడ్డు సౌకర్యాలు లేక సాధారణ పరిస్థితుల్లో కాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాకు నరకయాతనగా ఉండేది. కనీసం గ్రామానికి ఆటో వచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదు. 2018 ఎన్నికల్లో పట్నం నరేందర్‌రెడ్డి ప్రచార నిమిత్తం గ్రామానికి వచ్చి రోడ్డు సమస్యకు స్పందించి దగ్గరుండి అప్పట్లోనే రోడ్డు చదును పనులు చేయించారు. దాంతో గ్రామానికి కొంత వరకు రోడ్డు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. అంతటితో సరిపోదనే ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి రూ. 2కోట్ల 70లక్షల తో బీటీ రోడ్డును మంజూరు చేసి, రోడ్డు పనుల ప్రారంభానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఏండ్ల కాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యతో పాటు రోడ్డు సమస్య తీరుతుండటంతో తమ ఆనందానికి అవధులు లేవని పేర్కొంటున్నారు. రోడ్డు పనులు శంకుస్థాపన చేపట్టిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుకొన్నామని, బీఆర్ఎస్ చేసిన మేలు జీవితంలో మర్చిపోమంటున్నారు.



గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంకు

## సీఎం కేసీఆర్ పథకాలు భేష్..



ఏళ్ల కాలంగా గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడేవాళ్లం. తెల్లవారుజాము కాకముందే ఖాళీ బిందెలతో గుట్టల్లో పరుగులు తీయాల్సి వచ్చేది. మిషన్ భగీరథ నీరు గ్రామానికి చేరుకొన్న నాటి నుంచి గ్రామంలో తాగునీటి కష్టాలు తీరాయి. మాలాంటి ఎన్నో గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్. మిషన్ భగీరథ పథకం ప్రారంభం నాటి నుంచి మా గ్రామానికే కాడు యావత్ తెలంగాణ రాష్ట్రంలో తాగునీటి గోసకు చరమ గీతం పాటడం జరిగింది. నేడు మహిళలు ఇంటి వద్దనే స్వచ్ఛమైన శ్రీశైలం కృష్ణా జలాలను కడవల్లో నింపుకొంటున్నారు. శ్రీశైలం వెళ్లినప్పుడే కృష్ణనీటిని కంటికి అద్దుకునే వాళ్లం నేడు ప్రతి రోజూ మిషన్ భగీరథ నీటితో కృష్ణాజలాలను కంటి అద్దుకోవడమే కాదు, అన్నింటా సౌకర్యాలను తీర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మిషన్ భగీరథ పథకం చరిత్రలో నిలిచి ఉంటుంది. **-నారాయణరెడ్డి, ధర్మాపూర్, అంగడిరూచూర్, కొడంగల్**



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

## రూ.2.70కోట్ల బీటీ రోడ్డు..



ధర్మాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యాలు లేక అన్ని కాలాల్లో ఇబ్బందులు పడేవాళ్లం. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితో మా గ్రామానికి రూ. 2కోట్ల 70లక్షలతో బీటీ రోడ్డు మంజూరు కాబడి పనులకు శంకుస్థాపన జరిగింది. రోడ్డు చూస్తామో లేదో అనుకున్నాము. గతంలో నాయకులకు మా గోడును వినిపించుకున్న ఎవరు పట్టించుకోలేదు. నియోజకవర్గానికి చివరిగా ఉన్న గ్రామం, అభివృద్ధిలో కూడా చివరిగానే నిలిచిపోయింది. ప్రజలకు ప్రధానంగా అవసరమై ఈ రెండు సౌకర్యాలు పట్నం నరేందర్‌రెడ్డితోనే సాకారం అయ్యింది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు, ఎంత మంది నాయకులు వచ్చినప్పటికీ మాకు మేలు జరగలేదు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మా గ్రామానికి ఒక్కోటిగా తాగునీటి, రోడ్డు సమస్యలు తీరాయి.

**-మధుసూధన్ రెడ్డి, ధర్మాపూర్, అంగడిరూచూర్, కొడంగల్**